

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న వ్రత పురోహితులు తమ విధులకు సకాలంలో రాకపోయినా, డ్యూటీలు ఎగ్గొట్టినా కఠిన చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించనని దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీకమాసంలో వ్రతాలు నిర్వహించుకునే వారి రద్దీకి అనుగుణంగా టిక్కెట్ కౌంటర్లు ప్రారంభించే ముందే ఆయా బ్యాచ్‌లకు సంబంధించిన పురోహితులు ప్రతి ఒక్కరూ వ్రతాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సెలవు పెట్టేందుకు వీల్లేదని ఆయా తరగతుల బాధ్యులు చూసుకోవాలని ఇందుకు విరుద్ధంగా ఏ వ్రత పురోహితుడు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని ఇఒ హెచ్చరించారు.

# పూట గడవని క్లాప్ మిత్రలు

- పల్లెలను పరిశుభ్రంగా ఉంచే కార్మికులు
- క్లాప్ మిత్రలకు అందని వేతనాలు
- నెలల తరబడి పెండింగ్
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రస్తుతం విపరీతంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వాటితో పోల్చుకుంటే ప్రస్తుతం అరకొర వేతనాలే అందుతున్నా కార్మికులు గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేందుకు విశేష కృషి చేస్తున్నారు. దుమ్మూ ధూళిలో పని చేస్తూ వారి ఆరోగ్యాలను పణంగా పెట్టి శ్రమిస్తున్నారు. పల్లెల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఎక్కడ చెత్త పోగుబడినా వెంటనే తీసి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇలా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణలో పాల్గొంటున్న క్లాప్ మిత్రలకు సుమారు ఏడాదికాలంగా వేతనాలు అందడం లేదు. నెలకు కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నా అవీ ప్రతినెలా సక్రమంగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కాకినాడ జిల్లాలో 1,701 మంది క్లాప్ మిత్రలు పంచాయతీల్లో పారిశుధ్య పనుల్లో కీలక పాత్ర వహిస్తున్నారు. 2021 అక్టోబర్ 2న రాష్ట్ర ప్రభుత్వం గాంధీ జయంతి రోజున క్లిన్ ఎపి పేరుతో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు ప్రారంభించింది. దీనిలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను కొనసాగిస్తోంది. రిక్షాలు, ఆటోలు ద్వారా సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు క్లాప్ మిత్రలు తరలి స్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు డ్రైన్లలో పూడుకుపోయిన చెత్తను తొలగించి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా తీసుకునే చర్యల్లో భాగంగా పనిచేస్తున్నారు. తక్కువ వేతనమే అయినప్పటికీ ఎప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి పంచాయతీలో శాశ్వత ఉద్యోగులుగా నియామకాలు చేస్తుందనే ఆశతో పని చేస్తున్నారు. ఇచ్చేది అరకొర వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారిందని క్లాప్ మిత్రాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెంలో పనులు చేస్తున్న కార్మికులు

**10 నెలలుగా పెండింగ్**

ఒక్కొక్కరికీ రూ.6 వేలు మాత్రమే వేతనంగా ఇస్తున్నారు. పలు పంచాయతీల్లో అవీ 10 నెలల కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం సకాలంలో ఇవ్వకపోయినా అవకాశం ఉన్న కొన్ని పంచాయతీలు జనరల్ నిధుల నుంచి తీసి జీతాలు ఇస్తున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వీరికి జీతాలు చెల్లిస్తామని మొదట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ అమలు చేయలేదు. ఆ తర్వాత పంచాయతీలపైనే భారం మోపింది. 10 నెలలుగా ఒక్కొక్కరికీ రూ.60 వేలు వేతనం పెండింగ్‌లో ఉంది. ఇలా జిల్లావ్యాప్తంగా రూ.10.20 కోట్లు వేతనాలు ఇంకా ఇవ్వలేదు. అధికారులు మాత్రం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకే పెండింగ్ ఉన్నట్లు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆర్భాటంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినా అందులో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పులు, ఆయిల్, కూరగాయలు, గ్యాస్, ఉల్లిపాయలు ఇలా అన్ని ధరలూ విపరీతంగా పెరిగిపోయాయి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గనంటున్నాయి. రవాణా ఛార్జీల మోత మోగుతోంది. కరెంటు బిల్లులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు రూ.6 వేలు వేతనంతో ఎలా బతుకుతారనేది ప్రభుత్వమే చెప్పాలి. అవి కూడా కొన్ని నెలలుగా పెండింగ్ లోనే ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సకాలంలో జీతాలను విడుదల చేసి కనీస వేతనాలు అందివ్వాలని కోరుతున్నారు.

## రైతుల అభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ

రైతు అభ్యుదయం, వ్యవసాయ రంగ పురోగతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు. రాష్ట్రంలోని రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమం కింద 2023-24 సంవత్సరానికి రెండో విడత సహాయం పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు లంక ప్రసాద్, వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఏ రైతూ సాగు చేపట్టేందుకు అప్పు చేయవలసిన పరిస్థితి రానీయకూడదనే ఆశయంతో రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.13,500 సాగు ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా సహాయం క్రింద జిల్లాలో 1,80,434 మంది రైతులకు రరూ.74 కోట్ల 71 లక్షల ఆర్థిక సహాయాన్ని వారి ఖాతాలకు జమ చేసినట్టు తెలిపారు. కలెక్టర్ డాక్టర కృతికా శుక్లా మాట్లాడుతూ ఈ విడత సాయంతో కలిపి కాకినాడ జిల్లాలో 2019-20 నుంచి 2023-24 వరకూ గడచిన ఐదేళ్లకు గాను రూ.1,085 కోట్ల 50 లక్షల మొత్తాన్ని రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లాలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, పటిష్ట నీటి సరఫరా కార్యాచరణతో రబీలో పూర్తి ఆయకట్టుకు నీరు అందించేందకు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

## ఓటు నమోదుకు అర్హతే ప్రాతిపదిక

ప్రజాశక్తి-కాకినాడ

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరంలో ఫారం 6, 7, 8 ద్వారా కొత్త ఓట్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులకు సంబంధించి 1,881 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో సుమారు 80 వేల దరఖాస్తులు రాగా 56 వేల దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామన్నారు. ప్రత్యేక శిబిరాల్లో వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నదే లక్ష్యమన్నారు. జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురితమయ్యాక కూడా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు నూతన దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు(వైసిపి), తుమ్మల రమేష్ (టిడిపి), అప్పారావు (బిఎస్‌పి), అచ్యుతరామరాజు (అమ్ ఆద్మీ పార్టీ), డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, అధికారులు సీతాపతి, మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కబడ్డీ జట్టుకు ప్రగతి విద్యార్థి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిడదవోలులో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రగతి విద్యార్థి ఎస్.అవినాష్‌ను రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. ఎఒ సిహెచ్ఆర్.సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి సింగంపల్లి అవినాష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్ 19 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. బెంగళూర్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టులో అవినాష్ పాల్గొంటాడని వారు తెలిపారు. జట్టుతో పాటు అవినాష్ కూడా విజయం సాధించాలని పలువురు అవినాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కాలేజ్ ప్రిన్సిపల్ జి.నాగబాబు, పీడీ సిహెచ్.నాగేశ్వరరావు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## విజెస్ఎంఆర్ ఒడిగోస్‌కు గుర్తింపు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌కు రీజినల్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తింపు లభించింది. స్థానిక రమణయ్యపేటలో ఒడిగోస్ కార్యాలయంలో ఈ మేరకు మంగళవారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ మాట్లాడారు. అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన రీజినల్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌గా విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌కు గుర్తింపు లభించిందన్నారు. ఈ గుర్తింపు ద్వారా నిరుద్యోగులకు మరిన్ని మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు సర్టిఫికెట్ ను ఆవిష్కరించారు. మేరీ జ్యోతి, ఉషారాణి, నాని శిరీష, కుమార్, మౌలిక, వర్ష, విజయ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి రాజు

## డయల్ యువర్ కలెక్టర్‌కు ఆరు కాల్స్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి ఆరుగురు సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి కలెక్టర్‌కు నేరుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, ఎఒ శ్రీనివాసు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : టిడిపి

**చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పలువురు టిడిపి నాయకులు అన్నారు. మంగళావారం బాబు ష్యూరిటీ కార్యక్రమం ప్రచారంలో వారు పాల్గొన్నారు.**

ప్రజాశక్తి-యంత్రాంగం

**కాకినాడ** సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు 6వ డివిజన్‌లో పర్యటించారు. టిడిపి మహాశక్తి మేనిఫెస్టో కరపత్రాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుంగా నాగరాజు, పోలిపల్లి జగన్, ఒమ్మి బాలాజీ, గాది శివ, తుమ్మల రమేష్, షావుకారు బాబులు, గదుల సాయిబాబా, చిట్నీడి దొర, రాయుడు లక్ష్మణరావు, బొంతు సత్యనారాయణ ప్రసాద్, బత్తుల ఉమాదేవి, జారుల్లాఖాన్, కరీముల్లా పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** అమీనాబాద్ గ్రామంలో పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ పర్యటించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజలు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, సికోటి నానాజీ, జగన్నాథం, మడద విగ్నేష్, నాగేశ్వరరావు, కనకరాజు, తాతారావు, అప్పన్న, అప్పారావు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ఉండూరు గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా బుజ్జి, కుర్రా నారాయణ స్వామి, పెంకె వెంకటేష్ పాల్గొన్నారు.



## భూసేకరణ సొమ్ము చెల్లించేలా చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో జాతీయ రహదార్లులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల కోసం సేకరించిన భూముల రైతులకు త్వరితగతిన సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎంపీ వంగా గీత అధికారులను కోరారు. మంగళవారం కలెక్టర్ కృతికా శుక్లా ఎంపీ గీత జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌లకు అవసరమైన భూసేకరణ, సంబంధిత అంశాలపై రెవెన్యూ, రోడ్లు భవనాలు, జాతీయ రహదారులు, సర్వే, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ జిల్లాలో వాకలపూడి నుంచి అచ్చంపేట మీదుగా జాతీయ రహదారి-516, పిఠాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సత్వరం పూర్తిచేసి త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా నిర్వహించాలని, సేకరించిన భూములకు సకాలంలో సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌లకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, సర్వే, ఎన్.హెచ్ అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రధానంగా సామర్లకోట ఎడిబి రోడ్ నుంచి రాజానగరం వరకు నిర్మిస్తున్న రహదారి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



నియామకపత్రం అందుకుంటున్న సాయి

### ఆర్యవైశ్య సంఘం సభ్యునిగా సాయి

ప్రజాశక్తి-గండేపల్లి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘంలో కార్యవర్గ సభ్యునిగా మల్లేపల్లికి చెందిన బూర్లు సాయి నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ నియామక పత్రాన్ని సాయికి అందజేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ సంఘానికి చేసిన సేవలను గుర్తించి ఆర్యవైశ్య సంఘంలో కార్యవర్గ సభ్యునిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆదిత్య సివిల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రఘురామ్ 'భూమి ఒత్తిడి, నిలుపుదల నిర్మాణాలు' అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఉపన్యాసం విద్యార్థులు, అధ్యాపకులకు సివిల్ ఇంజనీరింగ్‌లో ఆలోచనా భావనలపై వారి అవగాహనను విస్తృతం చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

### నవజాత శిశు సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

నవజాత శిశువుల దినోత్సవం సందర్భంగా లైట్‌హౌస్‌లో సూర్యారావుపేట పంచాయతీ మహిళలకు నవజాత శిశువుల సంరక్షణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది డాక్టర్ వై.వసంత మాట్లాడుతూ పోషణ, పరిశుభ్రత ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటాయని, ఈ అంశాలు అన్నింటిపై నవజాత శిశువుల పెరుగుదలపై ప్రభావం చూపుతాయని చెప్పారు. శిశువుల రక్షణ చట్టాలు గురించి ఆమె వివరించారు. సీనియర్ న్యాయవాది శ్రీపాద రాజశేఖర్, సూర్యారావుపేట గ్రామ పంచాయతీ సెక్రెటరీ కె.వెంకటరత్నం, కె.శ్రీవల్లి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## 'బేటీ బచావో.. బేటీ పడావో'పై ర్యాలీ

ప్రజాశక్తి- తాళ్లరేవు

బాల్య వివాహాలను నిరోధించాలని ఐసిడిఎస్ పీడీ కొండ ప్రవీణ అన్నారు. బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించడానికి మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి సంతపేట సెంటర్ వరకు విద్యార్థులు, అంగన్వాడీ వర్కర్లు, అధికారులు ర్యాలీగా వెళ్లి సంతపేట సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ కె.ప్రవీణ, ఎంపిపి రాయుడు సునీత మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కడుపులో బిడ్డకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని, వాటిని నిరోధించడానికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి ఎం.బైరమూర్తి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్, సిడిపిఒ మాధవి పాల్గొన్నారు.




ర్యాలీని ప్రారంభిస్తున్న పీడీ, ఎంపిపి

## ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకూ..

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసీ శ్రీనివాస్, జెడ్‌పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపిటిసి సమ్మంగి దుర్గా ప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, కోరా బాబి, పప్పు సింహాచలం, తిప్పాన వెంకటరమణ, మీసాల నాగరాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామాల్లో ఉన్న సమస్యలకు సంబంధించి సత్వరమే చర్యలు తీసుకుంటామని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని అందరు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయాల పర్యటన సందర్భంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నిధులు మంజూరు ప్రకటించినట్టు చెప్పారు. వాటితో పాటు సిఎం దృష్టికి పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో రైతుల ఇబ్బందులకు సంబంధించి పుంత రోడ్ల నిర్మాణాలు వంటి విషయాలను తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత, డిఇ భాస్కర రమేష్, మండల పరిధిలోని సర్పంచులు,ార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల తేదీ పొడిగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశ పరీక్షకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తుల తేదీ పొడిగించినట్టు నవోదయ ప్రిన్సిపల్ కె.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్‌లను సందర్శించడం ద్వారా ఉచితంగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### బాధితురాలికి శ్రీను రాజు సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు


కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న బాధితురాలికి వైసిపి రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు ఆర్థిక సాయం అందించారు. విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం చొల్లంగికి చెందిన మేడిశెట్టి సత్యశ్రీ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదు సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పాల్గొన్నారు.

### యూత్ కాంక్లేవ్‌లో ఆదిత్య ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

విశాఖ గీతం యూనివర్సిటీ నిర్వహించిన 6వ యూత్ కాంక్లేవ్-2023లో 'ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ గ్లోబల్ ఛాలెంజస్' విభాగంలో ఆదిత్య సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కట్టా నవ్య సుభాషిణి, పెద్దిరెడ్డి చక్రవేణి, మంచాల లక్ష్మి, వర్షిణి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పిల్లా రవి కిషోర్ మార్గదర్శకత్వంలో తయారు చేసిన 'సస్టైనబుల్ టెక్ పార్క్' ప్రాజెక్ట్‌కు ఈ బహుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ బెల్లం రామ్మోహన్ రెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్. రమాశ్రీ వారిని అభినందించారు.

కార్టూ'నిజం'




### కబడ్డీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గండేపల్లి

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో జరగనున్న ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీలకు చెందిన ఆటగాళ్లు పాల్గొంటారని విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి తెలిపారు. జెఎన్‌టియుకె, ఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్.కె.రోజా, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, విసిలు జివిఆర్.ప్రసాద్‌రాజు, కె.పద్మ రాజు, పాల్గొంటారని తెలిపారు.

**ఘనంగా సివి.రామన్ జయంతి**

ఆదిత్య విద్యాప్రాంగణంలోని సర్ సివి.రామన్ భవనంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్.ఎస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.అశోక్ కుమార్, ఎఒ పి.వేణుగోపాల్, కె.వెంకటరమణ, తోటకూర గంగాధర్ పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## పంట కాల్వలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గోవలంక గ్రామానికి చెందిన 14 నెలల చిన్నారి మోర్త నాన్సీ పంట కాల్వలో పడి మృతి చెందినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గోవలంక గ్రామానికి చెందిన మోర్త వేణుగోపాల్, రమ్య దంపతుల ఏకైక కుమార్తె ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న పంట కాలవలో పడినీట మునిగింది. ఇంటి పని చేసుకుంటూ ఉండగా తనకు తెలియకుండా తన చిన్నారి పంట కాలవ వద్దకు వెళ్లి అసువులు బాసిందని తల్లి రమ్య బోరున విలపించింది.

## ఆటోను ఢీకొన్న గ్రావెల్ లారీ

ప్రజాశక్తి-మండపేట

గ్రావెల్ లోడు లారీ మంగళవారం ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. మండలంలోని ద్వారపూడి వైపు నుంచి మండపేటకు వస్తున్న గ్రావెల్ లోడు లారీ తాపేశ్వరంలోని అర్తమూరు తూము వద్దకు వచ్చేసరికి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎత్తు ఎక్కేంచే క్రమంలో ఒకసారిగా వెనక్కి రావడంతో వెనక ఉన్న ఆటోని ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఈ ఆటోలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## హత్యాయత్నంపై వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక వ్యక్తిని హత్య చేయడానికి ప్రయత్నించిన వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు వివరాలు ప్రకారం.. ర్యాలీ గ్రామానికి చెందిన దిడ్ల సురేష్‌ను అదే గ్రామానికి చెందిన కటారి రాజ్ కుమార్ హతమార్చాలని కున్నాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం సురేష్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించాడు. తటిలో తప్పించుకున్న సురేష్ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ మంగళవారం రాజ్‌కుమార్ అరెస్ట్ చేసి కొత్తపేట జెఎఫ్ సిఎం కోర్టులో హాజరు పరిచారు. రాజ్‌కుమార్‌కు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు లోఒక గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 56 సంవత్సరాలు వయసు ఉంటుందని అంచనా వేశారు. చోడవరం రోడ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ దాటిన తరువాత, రామచంద్రపురం వద్ద చనిపోయి ఉన్నాడని విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మతుని ఒంటిపై తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, నాచు రంగు ఫాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి యొక్క వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఈ క్రింది పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్లకు 94407 96589 08857 242333 వివరాలు తెలియ చేయాలని రామచంద్రపురం ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు.

## దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అన్నదానంలో భోజనాలు వడ్డిస్తున్న వారిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ కె.రామారావు మంగళవారం తెలిపారు. తణుకు- టి.వేమవరానికి చెందిన కొందరు యువకులు అకారణంగా పాలంగికి చెందిన మేడూరి మధు కుమార్, మంకు దుర్గారావు, దొడ్డా సూర్యనారాయణలతో గొడవపడి, దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి నిందితులు పాల సంతోష్ కుమార్, కేతా మణికంఠ, బండి వెంకటకష్ణలను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

## నిధుల దుర్వినియోగం కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వేట్లపాలెం పంచాయతీలో సుమారు రూ.3.46కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో ప్రస్తుత సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఆమె భర్త చిల్లి మోహన్ రావుతో మాజీ సర్పంచ్ భర్త, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాసు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, సిబ్బంది సూర్యకళను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు అప్పగించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కేసులో మొత్తం 11 మంది వ్యక్తులను నిందితులను గుర్తించగా అయిదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మిగిలినవారు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసు వర్గాలు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సిఐ కె.దుర్గా ప్రసాద్ చెప్పారు.

## బాణసంచా సీజ్

ప్రజాశక్తి -కరప

ప్రభుత్వ అనుమతులతో బాణసంచా తయారు చేస్తున్న కేంద్రాల్లో డిఎస్‌పి ఎమ్. మురళీకష్ణ రెడ్డి, కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాసు, ఫైర్ ఎస్ఐ యేసు బాబు, కరప ఎస్ఐ నౌదు రామకృష్ణ, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. వేళంగి గ్రామంలో నానాజీ ఫైర్ వర్క్స్ నందు పరిమితికి మించి మందు గుండు తయారు చేయడంతో ఆ షాపును మధ్యవర్తుల అనుమతితో సీజ్ చేశామని రామకృష్ణ తెలిపారు.

## అదుపు తప్పిన కారు

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం దర్గా సెంటర్ సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి 4 బైకులు, ఒక ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. దర్గా సెంటర్ నుండి ప్లీడర్ల వీధిలో కారు వెడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు అక్కడికి వెళ్లి గాయపడిన వారిని స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణ పరిధిలో సోమవారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకోని వారిని మంగళవారం కాకినాడ కోర్టులో హాజరు పరచారు. న్యాయస్థానం వారికి ఒక్కొక్కరికి రూ.10వేలుగా మొత్తం రూ.40వేలు జరిమానా విధించడం జరిగిందని సామర్లకోట సి. ఐ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు.

# యానాం వార్తలు

## ఇండోర్ స్టేడియంలో టిటి పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్ 14 విభాగంలో రాజీవ్ గాంధీ హైస్కూల్ ప్రథమ స్థానం సాధించగా, కామిశెట్టి వరప్రసాద్రావు నాయుడు గవర్నమెంట్ హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. అండర్ 17 బాలుర విభాగంలో రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రథమస్థానం సాధించగా డాక్టర్ కె ఆర్ నారాయణ హైస్కూల్ ద్వితీయ సాధించింది. ఈ జోనల్ గేమ్స్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిటి నక్కల సుబ్బన్న, ఐవికె.మోహన్, కొప్పనాతి భాస్కర్, వెనకోటి సన్యాసిరావు, జె.చంద్రశేఖర్, చింతం రామకష్ణ, పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆర్ఎఒ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి బదిలీ ఆర్డర్స్‌ను మిల్క్ బాయిలర్స్ లెక్క చేయడం లేదు. యానాం హైస్కూల్స్, ప్రైమరీ స్కూల్స్‌లో మిల్క్ బాయిలర్స్‌గా 21 ఏళ్ల నుంచి 42 మంది పనిచేస్తున్నారు. ఈ 42 మందిని వివిధ స్కూల్స్‌కి పరిపాలనాధికారి మునిస్వామి అక్టోబర్ నెలలో ట్రాన్స్ఫర్ చేశారు. 35 మంది ఆయా ప్లేసుల్లో జాయిన్ అయ్యారు. ఏడుగురు మాత్రం అదే ప్లేస్ లో కొనసాగుతున్నారు. దీనిపై రాజీవ్ గాంధీ సానిటరీ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కర్రి నాగమణి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్‌ను వారిపిఐ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ను మంగళవారం యానాంలో కవి, హిందీ పండితులు తాతపూడి సోమశేఖర శర్మ, పెద్దింటి లక్షణాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంద దేశాలలో వందే విశ్వమాతరమ్ పేరుతో శాంతి సద్భావన యాత్రను రెండేళ్ల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9న ఆఫ్రికాలోని బోట్స్‌వానాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం, వంద దేశాల తెలుగు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సద్భావన యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాకుల ప్రసాదరావు, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

## పాటంశెట్టి సూర్యచంద్ర దీక్ష విరమణ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని 9 రోజుల నుంచి జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.సూర్యచంద్ర చేపట్టిన నిరవధిక దీక్ష మంగళవారం రాత్రి విరమించారు. జగ్గంపేట మండలం రాజపూడి వద్ద చేస్తున్న సూర్యచంద్ర దీక్ష శిబిరం వద్ద జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నాయకులు చేరుకుని సూర్యచంద్రతో దీక్షను విరమింపజేశారు.

## విజిలెన్స్ వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో అవినీతిపై అవగాహన వారోత్సవాలు ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లతాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవర్ గ్రిడ్ ఉద్యోగులందరూ అవినీతికి తావు లేకుండా అంకిత భావంతో పని చేయాలన్నారు. ఏటా అవినీతి అవగాహన వారోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించడం ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగావ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు మరియు స్లోగన్ పోటీలు నిర్వహించారు. డిజిఎం సత్య వర్ధన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌వి.కుమార్ జె.కోటేశ్వరరావు, ఎఎస్‌ఎన్.మూర్తి ఉద్యోగులు పాల్గొన్నారు.

## సుంకరపాలెంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకర పాలెం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పలు చోట్ల చెత్త పేరుకుపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, చెత్తను తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలు దోమల వల్ల ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుంకర గోపి, కుడుపూడి సుబ్రహ్మణ్యం, గుత్తుల వెంకటరమణ, గుత్తుల వాసు, పలివెల పరమానందం పాల్గొన్నారు.

## నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ

నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెప్మా పీడీ బి.ప్రియంవద పేర్కొన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మెప్మా, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నీటి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపిక చేసిన 50 మంది అమృత్ మిత్రాలతో స్థానిక వాటర్ వర్క్స్ ఆవరణలో మంచినీటి వనరులను సంరక్షించుకోవలసిన ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముడి నీటిని శుద్ధి చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్న విధానాన్ని వీరికి వివరించారు. ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీటిని శుద్ధి చేసే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ ప్రియంవద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఇ శ్రీనివాస్, మెప్మా మిషన్ మేనేజర్ దేగల వెంకట్రాజు పాల్గొన్నారు.




బహుమతులు అందుకుంటున్న సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

## 'క్రియ' ఆధ్వర్యాన సైన్స్ ప్రయోగాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సివి రామన్ జయంతి సందర్భంగా స్థానిక రామారావు పేటలోని సైన్స్ సెంటర్‌లో క్రియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు చేయడంలో అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ 1930 తర్వాత నేటి వరకు విజ్ఞాన శాస్త్రంలో భారతదేశానికి ఒక్క నోబుల్ బహుమతి కూడా రాలేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడం ద్వారా వారిని పరిశోధన వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాత వాటర్ బాటిల్స్, నీరు, లేజర్ లైట్లు ఉపయోగించి కాంతి పరిక్షేపణం, టిండాల్ ప్రభావం వంటి అంశాలను ఈ ప్రయోగాల ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారన్నారు.

## బాల బాలికలకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు, ఐఆర్‌పిలకు, ఐఇడిఎస్ఎస్ టీచర్లకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమకూర్చిన ట్యాబ్‌లను ఎంపీ వంగా గీతాతో కలిసి కలెక్టర్ మంగళవారం అందజేశారు.

## దీపావళి నేపథ్యంలో భద్రతపై సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

దీపావళి పండుగ నేపథ్యంలో భద్రతా అంశాలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కార్మిక శాఖల అధికారులతో కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ మంగళవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి బాణాసంచా తయారీదారులు, విక్రయదారులు సురక్షితమైన వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు అన్ని ప్రామాణిక భద్రతా చర్యలను పటిష్టంగా పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధులు, మహిళలు, బాలలతో పనిచేయించ కూడదని, శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే నియమించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పి పడాల వెంకట మురళీకృష్ణా రెడ్డి, అగ్నిమాపక అధికారి డి.వి.సుబ్బారావు, తహశీల్దారులు, సిఐలు, తయారీదారులు, విక్రేతలు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనుల్లో అవకతవకలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పనుల్లో చేసిన అక్రమాలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు చేపట్టిన సామాజిక తనిఖీలో వెలుగు చూశాయి. పలు గ్రామాల్లో ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడ్డారని గుర్తించినట్లు డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి వసంత మాధవి, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేష్, ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, ఎపిఒ రాజబాబు పాల్గొన్నారు

## ఓటరు నమోదుకు 374 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కొత్తగా ఓటరు నమోదు కోసం 374 అప్లికేషన్లు అందాయని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారు 132 అప్లికేషన్లు, ఓటర్ జాబితాలో మార్పుల కోసం 184 అప్లికేషన్లు, చిరునామా మార్పు కోసం 92 అప్లికేషన్లు వచ్చాయన్నారు. దీనికి సంబంధించిన వివరాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'ఏమి సాధించారని వైసిపి యాత్ర'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేవలం పదవుల పంపకం కోసం కార్పోరేషన్లు పెట్టి బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీలను అణగదొక్కిన వైసిపికి సామాజిక సాధికార యాత్ర చేసే హక్కు ఉందా అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారయణ మూర్తి ప్రశ్నించారు. మంగళవారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్రకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసన తెలిపితే బస్సు చక్రాలకింద తొక్కుకుంటూ పోతామన్న అనిల్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉంటుందని చెప్పారు. అనతికాలంలోనే ప్రజలు తమ బ్రాహ్మాస్త్రమైన ఓటు హక్కుతో వైసిపిని తొక్కేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాతపూడి రామకృష్ణ, కాళ్ల శ్రీను, మట్టా ప్రకాష్ గౌడ్, అచ్యుత్, చల్మాజీ, వీరబాబు, పలివెల గాయత్రి పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ ఆధ్వర్యంలో 'జన సురక్ష'

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బండారులంక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఇందుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాళిని అధ్యక్షతన జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ (వ్యవసాయం) కె.ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్‌బిఐ అందిస్తున్న వివిధ పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్ స్కీముల గురించి సమగ్రంగా వివరించారు. రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఎస్‌బిఐ పథకాలను ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు.

కార్యక్రమంలో ఎస్‌బిఐ బండారులంక చీఫ్‌మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, బ్యాంకు మిత్ర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వందన సమర్పణ చేశారు.

## రామచంద్రపురంలో మొత్తం 1,98,001 ఓటర్లు నమోదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గం 42లో మొత్తం 1,98 001 ఓటర్లు నమోదై ఉన్నారని రెవెన్యూ డివిజనల్ అధికారి సుధాసాగర్ తెలిపారు. మంగళవారం రామచంద్రపురం నియోజకవర్గం లోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు మండల వారీగా కాపీలను అందజేశారు

## ఘనంగా సివి.రామన్ జయంతి

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత, భారతరత్న సర్ సివి రామన్ జయంతిని ప్రధానో పాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రామన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి-కొత్తపేట

అర్హులందరికీ పథకాలు అందుతాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 195వ రోజు మండల పరిధిలోని పనసలదొడ్డి, చిన్నమెరక, పెద్దమెరక కండ్రిగ గ్రామపంచాయతీ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకూ వెళ్లి సిఎం జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివద్ధి గురించి వివరించారు అయిన వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ల బహూకరణ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

లొల్ల గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్‌కు గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం తండ్రి. వెంకట్రావు జ్ఞాపకార్థం రెండు కంప్యూటర్లను మంగళవారం ప్రధానోపాధ్యాయులకు బహూకరించారు. అలాగే విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మరియు గ్రామ పెద్దలు మేడిత సత్తిపండు, దాట్ల సూర్యనారాయణ రాజు, కల్లూరి సత్యనారాయణ మూర్తి, కల్లూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

## విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-కాట్రేనికోన

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలను ప్రభుత్వ సంస్థ లు ఆధ్వర్యంలో మంగళవానం ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాట్రేనికోన బ్రాంచ్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతో పాటు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు మంగళవారం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ పి.మోహన్ రావు తదితరుల చేతుల మీదుగా కళాశాలలో బహుమతులను అందజేశారు.

## పారిశుధ్య లోపంపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపంపై ఎపి పిఆర్‌అండ్‌ఆర్‌డి స్పెషల్ కమిషనర్ సిరికి మంగళవారం లెటర్ ద్వారా తెలియపరిచినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు తెలిపారు. ఈ విషయమై సర్పంచ్ మరియు అఖిలపక్ష నాయకులు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్లామని ఈనెల 3న పంచాయతీ ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. అయినా స్పందన కాన రాలేదని లెటర్‌లో పేర్కొన్నారు. చెత్త పేరుకుపోవడంతో అనారోగ్యం పాల్పడుతున్నారని పేర్కొనగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వర లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

## కుష్టు బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం లెప్రసీ కాలనీలో మంగళవారం యూనివర్సల్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 38 కుష్టు బాధిత కుటుంబాలకు 26 కేజీలు చొప్పున బియ్యం పంపిణీ చేశారు. యూనివర్సల్ జి.మినిస్ట్రీ డైరెక్టర్ బిషప్ సంతోష్ బాబు, ప్రేమ్ భూషణ్, డేవిడ్ పాల్, కనికెళ్ళ కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు.